# ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

- కుట్టు శిక్షణలో రాణించాలి
- ఇది తొలి అడుగు మాత్రమే
- ట్రైనింగ్ శిబిరాలు కొనసాగుతూనే ఉంటాయి
- నారీ శక్తిని ప్రపంచానికి చాటాలి
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- 3వేల మందికి కుట్టుమిషన్‌లో శిక్షణ
- ఉచితంగా కుట్టు మిషన్ల అందజేత
- హాజరైన కలెక్టర్ భవేశ్‌మిశ్రా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పక్కన కలెక్టర్ భవేశ్‌మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ) : మహిళలు వ్యవసాయ కూలీలుగా, గృహిణులుగానే కాకుండా తమ కాళ్లపై తాము నిలబడి మరో నలుగురికి ఉపాధి చూపించేలా ఉండాలనే ఉద్దేశంతో ఒకేసారి మూడు వేల మందికి కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు కుట్టు మిషన్‌లో ఉచిత శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం డీఆర్‌డీవో పురుషోత్తం అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని మిలీనియం కాలనీలో జరిగింది. ఈ శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ భవేశ్‌మిశ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే గండ్ర మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ ప్రోగ్రాం చారిత్రాత్మకమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి పోరాటాలు చేసిన మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లో శిక్షణ ఇప్పించి కుట్టు మిషన్లను ఉచితంగా అందజేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భూపాలపల్లిలో మహిళలను ఉపాధి మార్గంలో నడిపించడానికి ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, తాజాగా మూడు వేల మందికి కుట్టు మిషన్ల శిక్షణ ఇప్పించి అందరికీ ఉచితంగా మిషన్లను పంపిణీ చేయలని తొలి అడుగు వేస్తున్నామన్నారు. ఈ శిబిరాలు భవిష్యత్తులో కొనసాగుతూనే ఉంటాయని చెప్పారు. పట్టణాల్లో బొటిక్ సెంటర్లకు మంచి డిమాండ్ ఉందని, ఇక్కడ నేర్చుకున్న మహిళలు జిల్లా కేంద్రంలో బొటిక్స్ సెంటర్లు నెలకొల్పి ఆర్థికంగా రాణించాలని కోరారు. చేర్యాల, నిర్మల్, పోచంపల్లి వస్త్ర తయారీకి పేరొందాయని, భూపాలపల్లి కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ, బొటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారాలన్నారు. తెలంగాణ వంటలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందని, దాన్ని సైతం పరిశ్రమగా మల్చుకోవచ్చన్నారు. ఇక్కడ రైస్‌మిల్ పెట్టించి మహిళా సంఘాలే ధర నిర్ణయించేలా చేస్తామన్నారు. మహిళలు డెయిరీ పరిశ్రమను సైతం నెలకొల్పి అందులోనూ రాణించవచ్చన్నారు. భూపాలపల్లి మహిళలు ఒక రోల్‌మోడల్‌గా నిలవాలని, అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుతో అపారమైన అవకాశాలు రాబోతున్నాయన్నారు.

**కమిట్‌మెంట్‌కు కేరాఫ్ జ్యోతి**

మహిళలు ఒక కమిట్‌మెంట్‌తో ముందుకు సాగితేనే విజయాలను సొంతం చేసుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు. ఈ విషయంలో తన భార్య జ్యోతిని స్ఫూర్తిగా తీసుకోవచ్చన్నారు. తమ పెళ్లి అయిన కొత్తలో జ్యోతి ఇంటికే పరిమితమైందని, క్రమక్రమంగా కాలనీలో సామాజిక కార్యక్రమాలు చేపట్టడం మొదలు పెట్టిందన్నారు. వరంగల్ మున్సిపల్ మేయర్‌గా చేయాలని సంకల్పించినప్పటికీ కుదరలేదన్నారు. అనంతరం రాజకీయాల్లో తనకు చేదోడు వాదోడుగా నిలిచి, తనను వెనుకుండి నడిపించదన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన అనంతరం హైదరాబాదలో ఇంటి దగ్గర పార్కులో వాకింగ్ చేసేవాళ్లమని, ఈ క్రమంలో జ్యోతి రన్నింగ్ ప్రాక్టీస్ చేసి లండన్, అమెరికా తదితర దేశాల్లో రన్నింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిందన్నారు. ఇదంతా ఒక కమిట్‌మెంట్‌తోనే సాధ్యమైందని, మహిళలు పట్టు పట్టి ఒక కమిట్‌మెంట్‌తో ముందుకు సాగి అనుకున్నది సాధించాలన్నారు. కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టామన్నారు. ఎమ్మెల్యే ఒక ఐడియా ఇచ్చారని, మూడు వేల మందికి కుట్టు మిషన్‌లో శిక్షణ ఇప్పించి ఉచితంగా మిషన్లను అందజేసే ప్రోగ్రాం తీసుకోవాలని తెలుపగా వెంటనే దాన్ని అమలు చేశామన్నారు. కుట్టు మిషన్ శిక్షణతో పాటు ఎంబ్రాయిడరీ, డిజైన్లు అన్నీ నేర్పుతామన్నారు. రూ.2కోట్ల విలువైన బ్రాండెడ్ కుట్టు మిషన్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్సాని లక్ష్మీనరసింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, డీఎంసీ రాజేశ్వరి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, మెప్మా అధ్యక్షురాలు స్వప్న, బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# పని చేసేవారికే పట్టంకట్టాలి

- బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే మరింత అభివృద్ధి
- 9,10వ వార్డుల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించాం
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 2 : పనిచేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9,10వ వార్డులు పుల్లూరి రామయ్యపల్లి, మంజూర్‌నగర్, బీసీ కాలనీల్లో రూ.9.55 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామాల నిర్మాణాలకు సోమవారం ఎమ్మెల్యే గండ్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పుల్లూరి రామయ్యపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలు అడిగినా అడగకపోయినా అన్ని రకాల అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. మంత్రి కేటీఆర్ భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారని, ఇటీవల రూ.50 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. 9,10వ వార్డుల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పాలిచ్చే ఆవు లాంటి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. దొంగ మాటలు చెప్పే వారిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు సమానంగా కొనసాగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలు, ప్రాంతాలను సమాన దృష్టితో చూస్తున్నారని తెలిపారు. పేదలకు డబుల్‌బెడ్ రూం ఇండ్లు, గృహలక్ష్మి, దళితబంధు, కల్యాణలక్ష్మి, బీసీలకు రూ.లక్ష వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గోదావరి జలాలతో మున్సిపాలిటీ ప్రజలకు తాగు నీరు అందించి సమస్య తీర్చామన్నారు. విద్య, వైద్యం, తదితర రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నదని వివరించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని, రాబోయే ఎన్నికల్లో ఆదరిస్తే ఇంకా అభివృద్ధి పనులు చేస్తానని ఎమ్మెల్యే గండ్ర ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, కౌన్సిలర్లు, బద్ది సమ్మయ్య, ముంజాల రవీందర్ గౌడ్, బానోత్ రజిత, నాయకులు బీబీ చారి, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, డీఈ శ్రీనాథ్ పాల్గొన్నారు.


పుల్లూరి రామయ్యపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సే..

- గులాబీ పార్టీలో చేరిన సీతక్క ముఖ్య అనుచరులు
- కాంగ్రెస్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు
- సీతక్క రాజకీయ డ్రామాలను ప్రజలు గుర్తించాలి
- రాష్ట్ర రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి
- హాజరైన ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి, మాజీ మంత్రి చందూలాల్ తనయుడు ధరమ్‌సింగ్

ములుగు, అక్టోబర్ 2(నమస్తేతెలంగాణ)/ ములుగు రూరల్ : రాష్ట్రంలో ముచ్చటగా మూడో సారి అధికారంలోకి వచ్చేది సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీ నేనని రెడ్‌కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ములుగులో సీతక్క ముఖ్య అనుచరులు, పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి సతీశ్‌రెడ్డితో పాటు జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ తనయుడు ధరమ్‌సింగ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే సీతక్క ముఖ్య అనుచరులు గులాబీ పార్టీలో చేరారని అన్నారు. ఇందులో సీతక్క సొంత గ్రామమైన జగ్గన్నపేట నాయకులతో పాటు పొట్లాపూర్ సర్పంచ్ లత అంకిరెడ్డి, వార్డు సభ్యులు ధనసరి సమ్మక్క, పొలుదుగు రాకేశ్, లావుడ్యా కవిత, యుగంధర్‌తో పాటు 100మంది కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరారని తెలిపారు. 20 సంవత్సరాల నుంచి సీతక్క వెంట నడిచినా కూడా ఆమె సొంత గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని పార్టీలో చేరిన వారు తెలిపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, సీతక్క రాజకీయ డ్రామాలు ప్రజలు గుర్తించాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో పాటు ములుగు జిల్లాలో చేపడుతున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీలోకి కాంగ్రెస్ నాయకులు వస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని గెలిపించుకొని ములుగును మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అంటూ ప్రచారం చేస్తున్నారని, కానీ, ఆ గ్యారెంటీలను అమలు చేసే నాయకుడు ఎవరో చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆ పార్టీ నేతలున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మద్ది రాజేందర్, కొమురెల్లి సతీశ్, యువరాజ్, నాగరాజు, రమేశ్, భిక్షపతి, చిన్న రాజన్న, సదయ్య, నాగరాజు, రాజన్న, సాంబమూర్తి, సంతోష, అట్టక్క, సుజాత, కవిత, సంధ్య, సమ్మయ్య, సరిత, వసంత, సరోజన, కళావతి, కావటి రాజేందర్, నూనేటి రమ, కన్నెబోయిన రాజన్న, నర్సయ్య, గండ్రకోట అశోక్, ఐలయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, పత్తిపల్లి ఎంపీటీసీ నూనవత్ మహేశ్‌నాయక్, నాయకులు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, సకినాల శశికాంత్, ఆదిరెడ్డి, బైకాని సాగర్, సురేందర్, ఆకుతోట చంద్రమౌళి, మాదం సాగర్, సానికొమ్ము దిలీప్‌రెడ్డి, అంకూస్, కోగిల మహేశ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సీతక్క స్వగ్రామంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్‌కో చైర్మన్ సతీశ్‌రెడ్డి

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
సబ్ ఎడిటర్లు కావలెను
ప్రముఖ దినపత్రిక నమస్తే తెలంగాణ
వరంగల్ యూనిట్
కార్యాలయంలో పని చేయడానికి
సీనియర్ సబ్ ఎడిటర్లు/సబ్ ఎడిటర్లు
కావలెను.
తెలుగు భాష, క్వార్క్ ఎక్స్‌ప్రెస్ మీద పట్టు,
ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేసిన అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను
hr@tppl.news మెయిల్ ఐడీకి
ఈ నెల 5 లోగా పంపగలరు.
వివరాలకు 040-23291159